## క్లుప్తంగా

### సీఎంఆర్‌ఎఫ్ చెక్కు అందజేత

కమ్మర్‌పల్లి: కమ్మర్‌పల్లి మండలం శ్రీరాజరాజేశ్వరీ నగర్ గ్రామానికి చెందిన సరిగెల సాయిలుకు ముఖ్యమంత్రి సహాయ నిధి నుంచి మంజూరైన రూ.60 వేల ఆర్థిక సహాయం చెక్కును కాంగ్రెస్ జిల్లా ప్రధాన కార్యదర్శి తిప్పిరెడ్డి శ్రీనివాస్ అందజేశారు. ఆర్థిక సహాయం మంజూరుకు కృషి చేసిన రాష్ట్ర సహకార యూనియన్ లిమిటెడ్ చైర్మన్ మానాల మోహన్‌రెడ్డికి సాయిలు కృతజ్ఞతలు తెలిపారు.

### బీజేపీ మండల కమిటీ ఎన్నిక



నవీపేట: బీజేపీ జిల్లా కార్యదర్శి, మండల ఇన్‌చార్జి సుధాకర్ చారి ఆధ్వర్యంలో గురువారం మండల కమిటీని ఏకగ్రీవంగా ఎన్నుకున్నారు. అధ్యక్షుడిగా ద్యాగ సరిన్, ప్రధాన కార్యదర్శులుగా మంత్రి రాజేందర్ గౌడ్, నీరడి భూషణ్, ఉపాధ్యక్షులుగా కోరె గంగాధర్, అజయ్, పండ్ల శ్రీనివాస్, వెంకటేష్‌లను ఎన్నుకున్నారు. నూతన కమిటీ ప్రతినిధులకు నియామకపత్రాలను అందజేశారు.

### అభినందనలు



బోధన్: బోధన్‌కు చెందిన సీనియర్ న్యాయవాది రాజుపటేల్ తెలంగాణ ప్రదేశ్ కాంగ్రెస్ కమిటీ లీగల్, హ్యూమన్ రైట్స్, ఆర్‌టీఐ విభాగం రాష్ట్ర కన్వీనర్‌గా నియామకమైన సందర్భాన్ని పురస్కరించుకుని గురువారం పట్టణ కేంద్రంలోని కోర్టులో బార్ అసోసియేషన్ ఆధ్వర్యంలో ఆయనను న్యాయవాదులు ఘనంగా సన్మానించారు. న్యాయవాదులు వీఆర్ దేశాయ్, నీరడి ఈశ్వర్, కోటేశ్వర్‌రావు, అడ్లూరి శ్రీనివాస్, శంకర్, రవీందర్, వీరభద్రప్ప తదితరులు పాల్గొన్నారు.

### సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి పాలాభిషేకం



బోధన్: ధూప దీప నైవేద్య పథకానికి నిధులు పెంచుతూ అర్చకులకు మేలు చేసే జీవోను అమలు చేస్తున్నందుకు హర్షం వ్యక్తం చేస్తూ గురువారం పట్టణంలోని రాకాసీపేట ప్రాంతంలోని హనుమాన్ మందిరం ఆవరణలో సీఎం రేవంత్ రెడ్డి చిత్రపటానికి అర్చకులు పాలాభిషేకం చేశారు. ధూప దీప నైవేద్య అర్చకుల సంఘం జిల్లా అధ్యక్షుడు రాచప్ప, ప్రతినిధులు శ్రీనివాస్ శర్మ, శంకరప్ప, బసప్ప, సంగంనాథ్ అప్ప, పంచాక్షరి మహరాజ్, శివానంద్, రాచప్ప స్వామి, రాజు మహరాజ్, వివిధ గ్రామాల అర్చకులు పాల్గొన్నారు.

### అర్చకుల సంఘం మండల అధ్యక్షుడిగా సంగంనాథ్ ఎన్నిక

బోధన్: చిన్నమావంది గ్రామ మల్లికార్జున స్వామి శివాలయం అర్చకుడు సంగంనాథ్ అప్ప ధూపదీప నైవేద్య అర్చకుల సంఘం మండల అధ్యక్షుడిగా ఎన్నికయ్యారు. గురువారం పట్టణ కేంద్రంలో అర్చక సంఘ సభ్యులు సమావేశమై, జిల్లా అధ్యక్షుడు రాచప్ప సమక్షంలో ఆయనను ఎన్నుకున్నారు. సంఘ సభ్యులు, ప్రతినిధులు పాల్గొన్నారు.

### 'రైతు భరోసా'కు దరఖాస్తు చేసుకోండి

కమ్మర్‌పల్లి: కొత్తగా పట్టా పాస్‌బుక్ పొందిన రైతులు ప్రభుత్వం అందించే పంట పెట్టుబడి సాయం రైతు భరోసా కోసం దరఖాస్తు చేసుకోవాలని ఏవో రమ్యశ్రీ తెలిపారు. దరఖాస్తు ఫారంతో పట్టా పాస్‌బుక్, ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్ ప్రతులతో ఏఈవోలను సంప్రదించాలని సూచించారు. రైతు బీమా కోసం నామిని ఆధార్, బ్యాంక్ పాస్‌బుక్ జిరాక్స్‌లను సమర్పించాలన్నారు. ఇది వరకే రైతు భరోసా పొందుతున్న రైతులు బ్యాంక్ ఖాతా మార్పు లేదా మొబైల్ నంబర్ మార్పులకు అవకాశం ఉందన్నారు. అందుకు సంబంధించిన ధృవీకరణ పత్రాలను వెంట తీసుకురావాలని కోరారు.

### ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలి

రెంజల్(బోధన్): భారీ వర్షాల సమయంలో ప్రమాదాల నివారణకు చర్యలు తీసుకోవాలని ఎస్సై చంద్రమోహన్ సూచించారు. కల్యాపూర్‌లో గురువారం స్థానికులతో సమావేశమై అవగాహన కల్పించారు. పాత ఇళ్లు కూలిపోయే దశలో ఉంటే వెంటనే సురక్షిత ప్రదేశాలకు వెళ్లాలని సూచించారు. విద్యుత్ ప్రమాదాలు జరగకుండా జాగ్రత్తలు తీసుకోవాలని వివరించారు. ఈదురు గాలులకు చెట్లు విరిగి పడే అవకాశం ఉంటుందని, వాహనదారులు చెట్ల కింద తలదాచుకోవద్దని అన్నారు.

# మొదటి రోజు ఉత్సాహంగా..

నూతన విద్యాసంవత్సరం ప్రారంభం కావడంతో గురువారం పాఠశాలల్లో బడి గంట మోగింది. మొదటి రోజు విద్యార్థులు ఉత్సాహంగా పాఠశాలలకు హాజరయ్యారు. పాఠశాలల్లో నూతన అడ్మిషన్లు ఇచ్చారు. విద్యార్థులకు పాఠశాల ప్రారంభం రోజే దుస్తులు, పుస్తకాలను పంపిణీ చేశారు.

– సాక్షి నెట్‌వర్క్



దొంకేశ్వర్‌లో దుస్తులు పంపిణీ చేస్తున్న వీడీసీ సభ్యులు, ఉపాధ్యాయులు



సాలూర మండలం తగ్గెల్లిలో పుస్తకాలు, దుస్తులు పంపిణీ చేస్తున్న తహసీల్దార్ శశిభూషణ



బుస్సాపూర్‌లో అడ్మిషన్ అందజేస్తున్న ఉపాధ్యాయులు



నాగంపేట్‌లో.. ఉపాధ్యాయులు, వీవోఏలు



కుకునూర్ హైస్కూలులో..



పడగల్ హైస్కూలులో.. సొసైటీ చైర్మన్ హన్మంత్ రెడ్డి, ఉపాధ్యాయులు



మాక్లూర్ ప్రభుత్వ పాఠశాలలో..

### బొట్టు పెట్టి, చాక్లెట్లు పంచిపెట్టి..



దొంకేశ్వర్(ఆర్మూర్): నూతన విద్యా సంవత్సరం ప్రారంభం సందర్భంగా తొండాకూర్‌లో ఎస్‌ఎస్‌వీ పాఠశాల ఉపాధ్యాయులు వినూత్న ఏర్పాట్లు చేశారు. విద్యార్థులకు బొట్టు పెట్టి, పువ్వులు చల్లి, చాక్లెట్లు పంచుతూ స్వాగతం పలికారు. విద్యార్థులు ఉత్తేజంతో తరగతి గదులకు వచ్చేందుకు ఈ విధమైన ఏర్పాట్లు చేసినట్లు పాఠశాల కరస్పాండెంట్ చిరంజీవి తెలిపారు.



ఆర్మూర్ ఉన్నత పాఠశాలలో.. హెచ్‌ఎం సదాశివ్



హసాకొత్తూర్‌లో.. హెచ్‌ఎం కృష్ణకుమార్

### పాఠశాలల ఆకస్మిక తనిఖీ



మాక్లూర్: కల్లెడి, గుత్ప ప్రభుత్వ పాఠశాలలను గురువారం ఆలూర్ మండల విద్యాధికారి నరేందర్ ఆకస్మిక తనిఖీ చేశారు. మొదటి రోజు పిల్లలు ఎంత మంది హాజరయ్యారు అనే విషయాలను ఉపాధ్యాయులను అడిగి తెలుసుకున్నారు. పాఠశాల పరిస్థితిని క్షుణ్ణంగా పరిశీలించారు. ప్రధానంగా మధ్యాహ్న భోజనం అందించే విషయమై కచ్చితమైన ఆదేశాలు ఇచ్చారు. హెచ్‌ఎం నాగరాజు, ఉపాధ్యాయులు ఉన్నారు.



నందిపేట: కంఠంలో.. ఎంఈవో గంగాధర్

### పునరుద్ధరణ అభినందనీయం

బోధన్: మూతపడిన ప్రభుత్వ పాఠశాలను తిరిగి తెరిపించడం అభినందనీయమని బోధన్ సబ్ కలెక్టర్ వికాస్ మహతో అన్నారు. భవానిపేట మండల పరిషత్ ప్రాథమిక పాఠశాల 11 ఏళ్ల నుంచి విద్యార్థులు లేని కారణంగా మూతపడి ఉంది. ప్రొఫెసర్ జయశంకర్ బడి బాట కార్యక్రమంలో మండల విద్యాశాఖ అధికారులు గ్రామయువత, దాత సహకారంతో పాఠశాలను పునరుద్ధరణ చర్యలు చేపట్టారు. పాఠశాల పున: ప్రారంభం సందర్భంగా గురువారం ఆ పాఠశాల ప్రారంభోత్సవ కార్యక్రమాన్ని నిర్వహించారు. ముఖ్య అతిథిగా విచ్చేసిన సబ్ కలెక్టర్, ఎంఈవో నాగయ్య, గ్రామ పెద్దలతో కలిసి పాఠశాలను పున: ప్రారంభించినంతరం విద్యార్థులకు పాఠ్య పుస్తకాలు పంపిణి చేశారు. ప్రస్తుతం పాఠశాలలో 31 మంది విద్యార్థులు పేర్లను నమోదు చేసుకున్నారు.



పుస్తకాలను పంపిణీ చేస్తున్న సబ్ కలెక్టర్, ఎంఈవో

### బీజేపీ బలోపేతానికి కృషి చేయాలి

పెర్కిట్(ఆర్మూర్) : ఆలూర్ మండలంలో బీజేపీ బలోపేతానికి కృషి చేయాలని ఎమ్మెల్యే పైడి రాకేష్ రెడ్డి.. నాయకులు, కార్యకర్తలకు పిలుపునిచ్చారు. ఆర్మూర్ మండలం అంకాపూర్‌లో ఆలూర్ మండల బీజేపీ ప్రధాన కార్యదర్శిగా ఎన్నికైన అర్గ హరీష్, ఓబీసీ మండల అధ్యక్షుడిగా ఎన్నికైన నడిశరం మల్లయ్యకు గురువారం ఎమ్మెల్యే నియామక పత్రాలను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. స్థానిక సంస్థల ఎన్నికల్లో బీజేపీ అభ్యర్థుల గెలుపే లక్ష్యంగా నాయకులు కృషి చేయాలన్నారు.



హరీష్‌కు నియామకపత్రాన్ని అందజేస్తున్న రాకేశ్‌రెడ్డి

బీజేపీ ఆలూర్ మండల అధ్యక్షుడు సుర శ్రీకాంత్, తెలంగాణ బీజేపీ స్టేట్ కౌన్సిల్ సభ్యుడు కొత్తూరు గంగాధర్, డాక్టర్ అరుణ్, మహేష్ తదితరులు పాల్గొన్నారు.

### నీటి నిల్వలు తొలగించాలి

ఆర్మూర్‌టౌన్: ఎప్పటికప్పుడు నీటి నిల్వలను తొలగించాలని జిల్లా మెడికల్ ఆఫీసర్ డాక్టర్ తుకారాం .. మున్సిపాలిటీ, జీపీ అధికారులకు సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ కార్యాలయంలో అధికారులకు, అర్బన్ హెల్త్‌సెంటర్‌లో వైద్యసిబ్బందిలకు సీజనల్ వ్యాధుల నివారణపై ప్రత్యేక అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ.. వర్షాకాలంలో దోమల పెరుగుదల అధికమవుతుందని, వాటి ద్వారా వ్యాపించే డెంగీ, మలేరియా వంటి వ్యాధులపై ప్రజలు అప్రమత్తంగా ఉండాలన్నారు. మురికి గుంటల వద్ద ఆయిల్ బాల్స్ వేసి, బ్లీచింగ్ పౌడర్ చల్లాలని సూచించారు. ఆర్మూర్ మున్సిపల్ కమిషనర్ రాజు, డిప్యూటీ డీఎంహెచ్‌వో రమేష్, సిబ్బంది పాల్గొన్నారు.

## 'గణిత ప్రయోగశాల నిర్వహణ బాగుంది'

బోధన్ : గణిత ప్రయోగశాల నిర్మాణం, నిర్వహణ చాలా బాగుందని ఎడపల్లి మండలం ఏఆర్‌పీ క్యాంప్ జీహెచ్‌ఎస్ పూర్వ విద్యార్థి, దాత ఎడమకంటి కృష్ణారెడ్డి అన్నారు. అమెరికాలో సాఫ్ట్‌వేర్ ఇంజనీర్‌గా స్థిరపడిన కృష్ణారెడ్డి తాను చదువుకున్న పాఠశాలలో గణిత ప్రయోగశాల ఏర్పాటుకు ఆర్థిక సహాయం అందించారు. గురువారం పాఠశాలను సందర్శించి ప్రయోగశాలను పరిశీలించారు. ప్రయోగాత్మకంగా పాఠ్యాంశాలను బోధించడం వల్ల విద్యార్థులకు గణితం పట్ల భయం పోతుందన్నారు. పాఠశాల విద్యార్థుల కనీస అవసరాలు తీర్చేందుకు తాను ముందుంటానని తెలిపారు. దాత కుటుంబ సభ్యులను సన్మానించారు. హెచ్‌ఎం సురేందర్, ఉపాధ్యాయులు, పూర్వ విద్యార్థులు పాల్గొన్నారు.



దాత కృష్ణారెడ్డిని సన్మానిస్తున్న ఉపాధ్యాయులు

### సమ్మెను జయప్రదం చేయండి



వర్ని: కేంద్ర కార్మిక సంఘాలు జూలై 9న తలపెట్టిన దేశవ్యాప్త సార్వత్రిక సమ్మెను జయప్రదం చేయాలని ఆశా యూనియన్ జిల్లా ఉపాధ్యక్షురాలు స్వప్న పిలుపునిచ్చారు. గురువారం వర్ని మండల కేంద్రంలో ఆశా కార్యకర్తల సమావేశంలో ఆమె మాట్లాడారు. కేంద్ర ప్రభుత్వం ఆశా కార్యకర్తలకు ఉద్యోగ భద్రత కల్పించి, కనీస వేతనం రూ.26 వేలు అమలు చేయాలని డిమాండ్ చేశారు. సీఐటీయూ నాయకుడు నన్నేసాబ్, ఆశాకార్యకర్తలు నాగమణి, రాధ, బాలమణి పాల్గొన్నారు.

### ప్రీప్రైమరీ స్కూల్ ప్రారంభం

నందిపేట్(ఆర్మూర్): అయిలాపూర్ ప్రభుత్వ ప్రాథమిక పాఠశాల పూర్వ ప్రాథమిక(ప్రైమరీ) విద్య అందించేందుకు ఎంపికైంది. ఈ మేరకు గురువారం మండల విద్యాశాఖ అధికారి అవదూత గంగాధర్ ప్రి ప్రైమరీ పాఠశాలను ప్రారంభించారు. ఒకటో తరగతిలో చేరే ముందు అందుకు సన్నద్ధతగా చిన్నారులకు ప్రి ప్రాథమిక విద్యకు దోహదపడుతుందని అన్నారు. ఆటలు, పాటలు, కథల రూపంలో విద్యాబోధన ఉంటుందన్నారు.

# నత్తనడకన ఇందిరమ్మ గృహాలు

- ఇప్పటి వరకు 10 శాతం కూడా ప్రారంభం కాని ఇళ్లు
- ఉమ్మడి బాల్కొండ మండల పరిధిలో పరిస్థితి

బాల్కొండ : ప్రభుత్వం పేదల సొంతింటి కలను నెరవేర్చటానికి ప్రతిష్ఠాత్మకంగా చేపట్టిన ఇందిరమ్మ ఇంటి నిర్మాణాలు నత్తనడకన సాగుతున్నాయి. ఇంటిని నిర్మించుకునేందుకు లబ్ధిదారులు కూడా ముందుకు రావడం లేదు. దీంతో గ్రామాల్లో ఇప్పటి వరకు 10 శాతం ఇళ్లు కూడ ప్రారంభం కాలేదు. ప్రభుత్వం ఇంటి నిర్మాణం కోసం విడతల వారీగా రూ.5 లక్షలు అందిస్తుంది. కాని కనీసం పునాది వరకు పనులు పూర్తయితేనే రూ.లక్ష నగదు ఖాతాలో జమ చేస్తుంది. కాని లబ్ధిదారుల వద్ద ముందుగా పెట్టుబడి పెట్టటానికి చిల్లి గవ్వ లేకపోవడంతో ముందుకు రావడం లేదు. ప్రస్తుతం మార్కెట్‌లో ఉన్న ధరల ప్రకారం రూ.5 లక్షల్లో ఇంటి నిర్మాణం కావడం అనేది కలే. కనీసం మరో రూ. 2 లక్షలు అదనంగా ఖర్చు అవుతందంటున్నారు. ఇందిరమ్మ ఇంటి నిర్మాణం కోసం ప్రస్తుతం మేస్త్రీలకు డిమాండ్ ఏర్పడింది. దీంతో మేస్త్రీలు లభించకపోవడంతో కూడా పనులు ప్రారంభం కాకపోవడానికి ఒక కారణంగా చెబుతున్నారు. ఐకేపీ ద్వారా లబ్ధిదారులు రుణాలు పొంది నిర్మాణాలను ప్రారంభించుకోవాలని ఉన్నతాధికారులు సూచిస్తున్నారు. కాని ఐకేపీలో రుణాలు ఇవ్వడానికి అనేక కొర్రీలు పెడుతున్నారని లబ్ధిదారులు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. వీటన్నితోపాటు గురు మౌఢ్యమి ఉండటంతో కూడ ప్రారంభాలు కావడం లేదంటున్నారు. ప్రభుత్వం ముందస్తుగా డబ్బులు జమ చేస్తే ఎక్కువ మంది లబ్ధిదారులు నిర్మించుకునే అవకాశం ఉందనే అభిప్రాయం వ్యక్తం చేస్తున్నారు.



ముప్కాల్ మండలంలో సాగుతున్న ఇందిరమ్మ ఇంటి నిర్మాణం

**ఇందిరమ్మ ఇళ్ల సమగ్ర వివరాలు..**

| మండలం | మంజూరైన ఇళ్లు | మార్కవుట్ చేసినవి | ప్రారంభమైనవి |
|---|---|---|---|
| బాల్కొండ | 284 | 101 | 04 |
| మెండోరా | 328 | 113 | 10 |
| ముప్కాల్ | 246 | 59 | 09 |

**వెంటనే ప్రారంభించాలని సూచిస్తున్నాం**

ఇందిరమ్మ ఇళ్లు మంజూరైన లబ్ధిదారులు వెంటనే ఇండ్ల నిర్మాణాలు ప్రారంభించాలని సూచిస్తున్నాం. ఐకేపీ ద్వారా రుణాలు పొందవచ్చని డీఆర్‌డీఏ సూచించారు. గ్రామాల్లో నిత్యం లబ్ధిదారులతో మాట్లాడుతున్నాం.

– ఆనంద్ నరేశ్, ఎంపీడీవో, ముప్కాల్

## కుంటను తలపిస్తున్న పాఠశాల ప్రాంగణం



పోచంపాడ్ ఉన్నత పాఠశాల ఆవరణలో నిలిచిన నీరు

బాల్కొండ: మెండోరా మండలం పోచంపాడ్ ప్రభుత్వ ఉన్నత పాఠశాల ప్రాంగణం వర్షానికి కుంటలను తలపిస్తోంది. దీంతో గురువారం పాఠశాల పునఃప్రారంభం రోజే విద్యార్థులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొన్నారు. వర్షపు నీటిలో నుంచే పాఠశాల తరగతి గదుల్లోకి వెళ్లాల్సి వచ్చింది. వర్షపు నీరు నిల్వ ఉండకుండా చర్యలు తీసుకోవాలని విద్యార్థులు కోరుతున్నారు.

## విలువలతో కూడిన విద్యనందించాలి

- ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి

ఆర్మూర్: ప్రభుత్వ పాఠశాలల్లో విద్యార్థులకు ఉపాధ్యాయులు విలువలతో కూడిన విద్యనందించడం ద్వారా వారి భవిష్యత్తుకు బంగారు బాటలు వేయాలని ఆర్మూర్ ఎమ్మెల్యే పైడి రాకేష్‌రెడ్డి అన్నారు. అంకాపూర్‌లో ప్రొఫెసర్ జయశంకర్ బడిబాట కార్యక్రమాన్ని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో గురువారం నిర్వహించారు. ఆర్మూర్ మండల విద్యాధికారి రాజగంగారాం అధ్యక్షతన నిర్వహించిన ఈ కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై విద్యార్థులకు దుస్తులు, పాఠ్య పుస్తకాలు, నోటు బుక్కులను పంపిణీ చేసారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ.. ప్రభుత్వ పాఠశాలల్లో కార్పొరేట్ పాఠశాలలకు దీటుగా బోధన సాగుతోందన్నారు. ఆర్మూర్ ఎంపీడీవో బ్రహ్మానందం, ఐకేపీ ఏపీవో గంగారాం, ప్రధానోపాధ్యాయులు నర్సయ్య, సుభాషిణి, రారాం, తదితరులు పాల్గొన్నారు.



అక్షరాభ్యాసం చేయిస్తున్న ఎమ్మెల్యే రాకేష్‌రెడ్డి

### రోడ్డుకు అడ్డంగా చెట్టు.. తొలగించేదెప్పుడో..?



బాల్కొండ: రెండు రోజుల క్రితం ముప్కాల్ మండలం నల్లూర్ గ్రామ శివారులో ఈదురు గాలుల ధాటికి చెట్టు నేలకొరిగింది. చెట్టు రోడ్డుకు అడ్డంగా పడటంతో రాకపోకలకు ఇబ్బందిగా మారింది. ఎదురెదురుగా వాహనాలు వస్తే పోవడానికి తీవ్ర ఇబ్బంది అవుతుందని స్థానికులు చెబుతున్నారు. వెంటనే తొలగించాలని డిమాండ్ చేస్తున్నారు.



### పూర్వ విద్యార్థుల ఆత్మీయ సమ్మేళనం

పడగల్ ఉన్నత పాఠశాలలో చదువుకున్న 2001–02 ఎస్సెస్సీ బ్యాచ్ విద్యార్థులు గురువారం పూర్వ విద్యార్థుల సమ్మేళనం జరుపుకున్నారు. తమకు విద్యాబుద్ధులు నేర్పిన గురువులను ఆహ్వానించి పాదపూజ చేశారు. శాలువా, మెమెంటోతో ఘనంగా సన్మానించారు. పాఠశాల జ్ఞాపకాలను గుర్తు చేసుకొని ఆనందంగా గడిపారు. – వేల్పూర్

# కొనసాగుతున్న అమ్మ మాట.. అంగన్‌వాడీ బాట

ఆర్మూర్, బోధన్, బాల్కొండ నియోజకవర్గాల పరిధిలో అమ్మ మాట..అంగన్‌వాడీ బాట కార్యక్రమం గురువారం కొనసాగింది. అంగన్‌వాడీ టీచర్లు, ఐసీడీఎస్ అధికారులు పాల్గొని ప్రి స్కూల్ ప్రాముఖ్యత గురించి వివరించారు. అంగన్‌వాడీ కేంద్రాల్లో చిన్నారుల సంక్షేమానికి చేపడుతున్న పథకాల గురించి తెలియజేశారు. అనంతరం చిన్నారులకు సామూహిక అక్షరాభ్యాసం చేయించారు. పలు చోట్ల అవగాహన ర్యాలీలు నిర్వహించారు. – సాక్షి నెట్‌వర్క్



మాదాపూర్‌లో ర్యాలీ నిర్వహిస్తున్న అంగన్‌వాడీ టీచర్లు



కిసాన్‌నగర్‌లో..



ఆర్మూర్‌టౌన్: రంగాచారినగర్‌లో..



పాలెంలో కార్యక్రమం నిర్వహిస్తున్న కార్యకర్తలు



బోధన్ గోశాల అంగన్‌వాడీ కేంద్రంలో ..